# 5

పెద్ద ఆర్భాటం లేకుండా మరో మూడు రోజులలో కిరీటి శిల్పల వివాహం జరిగిపోయింది.

ఉన్న ఒక్కగానొక్క కూతురి పెళ్ళి జమిందారీ స్థాయికి తగ్గట్టుగా జరగాలని రంగనాథంగారు ఎంతపట్టు పట్టినా కిరీటి అంగీకరించలేదు. శిల్పకూడా సింపుల్‌గా జరగాలని పట్టుబట్టడంతో కళింకోట సత్యన్నారాయణ స్వామి కొండపై ఆ శుభకార్యం కాస్తా ముగించేశారు.

కిరీటి ఒంటరివాడు కావటంతో అతని తరుపున బంధువులెవరూ రాలేదు, ఒక్క భూషణ్ తప్ప.

అతడు కనీసం మిత్రుల్ని కూడా పిలవకపోవటం రంగనాథంగారికి బాధ అనిపించింది.

అందుకే ఇరువురి తరుపున తనే పెళ్ళి పెద్దగా వ్యవహరించారు.

గుట్టుచప్పుడు కాకుండా జరిగిన పెళ్ళి చివరకు ఆనోటా ఆనోటా పల్లెలోని ప్రజలకు తెలిసిపోవటంతో రంగనాథంగారు పొలంలో పనిచేసే పాలేకాపులకు మాత్రం చెప్పారు అబ్బాయి అభీష్టం ప్రకారం అలా చేయాల్సి వచ్చిందని.

తరతరాలనుండి వస్తున్న సంప్రదాయం ప్రకారం జరగకపోయినా పేదలకు మాత్రం అన్నవస్త్రాలను దానం చేశారు రంగనాథంగారు.

కిరీటి తనకు వ్యవధి లేదని ఎంత చెబుతున్నా చివరకు ఒప్పించి పెళ్ళయిన రాత్రి లోగిలిలోనే శోభనం ఏర్పాటు చేయించారు రంగనాథంగారు.

సిల్కు లాల్చీలో జరీ అంచు పంచకట్టుకొని డన్‌హిల్స్ సిగరెట్ కాలుస్తూ గదిలో పచార్లు చెయసాగాడు కిరీటి.

మనసులో విపరీతంగా ఆలోచనలు ముప్పిరి కొన్నప్పుడు తప్ప కిరీటి సిగరెట్ కాల్చడు.

ఖరీదైన అగరు వత్తుల పరిమళంతోను, పందిరి కోళ్ళ మంచాన్ని అందంగా అల్లుకున్న మల్లెపూలల సౌరభంతోను నిండిన గదిలోని వాతావరణం విచిత్రమైన మత్తుకి, పులకింతకీ కారణమౌతుంటే అతని పెదవులు సమ్మోహనంగా విచ్చుకున్నాయి.

దాంపత్య భవంతికి అర్ధరాత్రి తొలిరాత్రి పునాది అంటారు. భవిష్యత్తులో మోయాల్సిన బరువును మోయగల చిత్త స్థయిర్యాన్ని అనురాగాల అంతస్థుల నెన్నింటికైనా వేయగల మనో నిబ్బరాన్ని కలిగించే ఆ పునాది బలంగా ఉండాలన్నది అనాదిగా వస్తున్న ఆర్యోక్తి.

తత్తరపాటు లాంటిది కలుగుతుంటే కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు,

చిరు వెన్నెల నీడన పల్లె ఆదమరిచి నిద్రపోతుంది.

ఆకాశంలోని చందమామ తప్పి పోయిన ప్రియురాలిని వెతుకుతున్నట్లుగా హాడావిడిగా పరగులు తీస్తున్నాడు.

అతని మనసును మధురోహాల నందనవనంగా మారుస్తోంది.

గది తలుపులు తెరుచుకున్న చప్పుడుతో అతనిలోని తలపులు ముడుచుకున్నాయి.

భావం నుండి అనుభవానికి లాక్కుపోయే వివశత్వం......

నెమ్మదిగా వెనక్కి తిరిగాడు.

పాల నురుగువంటి తెల్లని పట్టు చీరను ధరించి పసిమి ఛాయను పుణికి పుచ్చుకున్న కాంచన గంగలా, రసరమ్య గీతికల ఓలలాడింప దివినుండి దిగిన అప్సరసలా, తెలి మబ్బుల మేలిముసుగులో నులివెచ్చని అనుభూతులనందించే తొలకరిజల్లులా, అల్లనల్లన నడచి వచ్చిన అజంతాచిత్ర సుందరిలా అనిపించిన శిల్పను లాలనగా గుండెలకు హత్తుకోవాలని తీయని తొలిరాత్రిని మాయని ఓ మధురక్షణంగా మలుచు కోవాలనిపించింది.

'శిల్పా!'

ఏకవచనంతో సంభోదించాలని తమ మధ్య దూరం తరిగిపోయిందని చెప్పాలనిపించే లాలనత్వం....

చివాలున అతనివైపు తిరిగిందామె.

'ఏం.... మీ సొత్తుగా మారిన ఈ గాజుబొమ్మను పరామర్శిస్తున్నారా! లేక మీ ఆనందం కోసం కొనుక్కున్న ఈ వస్తువు అనుభవానికేమైనా ఉపయోగపడుతుందేమో పరీక్షించాలనుకుంటున్నారా?' ద్వేషంతో అదురుతున్న ఆమె పెదవుల్ని చూసి అప్రతిభుడయ్యాడు.

'శిల్పా!' ఆర్ద్రతగా మరేదో చెప్పాలనుకున్నాడు.

'మిష్టర్ కిరీటి... మీరు కోరుకున్నది నన్నే కానీ నా మనసును కాదు.'

'శిల్పా! నిన్ను నేను కోరుకున్నది నా భార్యగానేకాని భోగ్య వస్తువుగా కాదు.'

'సర్‌ప్రైజింగ్.... భార్యకీ, భోగ్య వస్తువుకీ మధ్య తేడా కూడా ఉందని తెలుసన్నమాట మీకు.'

'శిల్పా!'

'యస్ మిష్టర్ కిరీటి .... మీ ఫ్యాక్టరీలోని ఓ యంత్రంలా నన్ను ఖరీదు కట్టి కొనుక్కున్నారు.'

'ఖరీదు కట్టింది నీకు కాదు.'

'బహుశా నా శరీరానికి అయ్యుండొచ్చు.'

'శిల్పా నేను నిన్ను కోరుకున్నాను కానీ కొనలేదు.'

'అవును... కోరికతోనే కొన్నారు.'

'శిల్పా!' అతడిలోని సహనం నశించిపోతుంది.

'శిల్పా!..... ప్లీజ్ ఐలైక్ యూ'

‘ఇది లైక్ నెస్ కాదు... తప్పించుకో వీలు లేక తనకి చిక్కిన లేడిపిల్లపై పులి చూపించే అభిమానం.’

ఆమె మాటలకతడు దారుణంగా గాయపడ్డాడు.

తనను తాను నిగ్రహించుకొన్నట్లుగా చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు.

‘శిల్పా!’ దూరంగా కార్పెట్పై తలగడ మీద తల పెట్టుకు పడుకున్న శిల్పను సమీపించాడు.

‘నీ అభిప్రాయాన్ని తెలుసుకోకుండా విషయాన్ని ఓ బిజినెస్ వ్యవహారంలా డీల్ చేయటం పొరపాటే... ఫర్ గివ్ మి’ ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

అతడలా బాధపడుతుంటే ఆమెకు మహదానందంగా వుంది.

‘అంత తేలిగ్గా నిన్ను క్షమించడం ఆత్మద్రోహమే మిష్టర్ కిరీటి.....’ ఆమె గొంతులో హేళన ధ్వనించింది.

‘ఇది మన తొలిరాత్రి ... ప్లీజ్ శిల్పా!’

‘మన రాత్రి అంటూ ఉంటేగా తొలిరాత్రి గురించి ఆలోచించటానికి.’

‘నాసహనానికి పరీక్ష పెట్టకు.’ రోషంగా అన్నాడు.

అవేశంగా ఆమె పైకి లేచింది.

‘ఓహో బెదిరిస్తున్నారా! చెప్పండి.... ఏం చేస్తారు. మీభార్య అనబడే ఈ ఆడపిల్లను బలవంతంగా అనుభవిస్తారు... లీగల్గా నన్ను రేప్చేసి మీ ఆహంకారాన్ని చల్లార్చుకుంటారు. అంతేగా.’

సిగ్గుతో అతడి తల వాలిపోయింది.

‘సారీ శిల్పా! నేనంత పశువుని కాను.‘

‘ఈజిట్..... అది నిజమే అయితే నిరూపించుకోవటానికి ప్రయత్నించండి.’

పరాజితుడిలా ముందుకు నడుస్తున్న కిరీటిని చూస్తూ గర్వంగా నవ్వుకుందామె .

ఆమె మనసునిండా ఆలోచనలు ముసురుకున్నాయి.

బాగా పరిచయమున్నట్టుగా అనిపిస్తున్న ఈ కిరీటి ఎవరు?

తనకోసం ఉచ్చునెందుకు పన్నాడు..

ఈ పన్నాగంలోని అంతరార్థం ఏమిటి?

తన జీవితానికి పర్యావసానం ఎలా వుంటుంది?

ఆమెకు కాలేజి రోజులు గుర్తుకొచ్చాయి..... తనకు పరిచయం వున్న అబ్బాయిల్ని గుర్తుకు తెచ్చుకుంది.

ఎంత జ్ఞప్తికి తెచ్చుకుందామన్నా ఫలితం లేక పోవటంతో ‘ఎవరీ కిరీటి... ఎక్కడో చూసినట్టుందే’ అనుకుంది ఎప్పటిలాగే.

# 6

మరుసటి రోజు ఉదయమే వైజాగ్ ప్రయాణమయ్యాడు కిరీటి.

మరో రెండు రోజులు పాటు ఉండమని రంగనాధంగారు బలవంతం చేసినా ససేమిరా వీలు కాదన్నాడు.

పైగా కిరీటి ఎన్నో వ్యాపారాలతో పరిశ్రమలకధిపతిగా ఎంత బిజీగా వుండేది స్వయంగా చూశారు కాబట్టి ఆపటం భావ్యంకాదని తలపోశారు.

పరువు బజారున పడకుండా కాపాడిన కిరీటి అంటే కృతజ్ఞత మాత్రమే గాకుండా కూతుర్ని సుఖపెట్టగల సమర్ధుడని కూడా ఆయనకు విశ్వాసముంది.

అయినా కూతురు ఇల్లువదిలి వెళ్తుంటే ఆయన కళ్ళు నీరు ఆగిందికాదు...

అదీకాకుండా 'పుట్టినింటికి అపఖ్యాతి రాకుండా కాపురాన్ని చక్కబెట్టుకో అమ్మా' అని అన్నప్పుడు శిల్ప ఇచ్చిన జవాబు ఆయన గుండెల్నింకా రంపపుకోత కోసింది.

'ఈ ఇంటి పరువు బజారున పడకుండా నన్ను బలి పశువునుచేసి వ్యధశిలపైకి నెట్టేశారు..... నేనెలాపోతే మీ కెందుకునాన్నా!'

శిల్ప మాటల్ని ఎంత ప్రయత్నించినా ఆయన మరిచి పోలేకపోయారు.

అందుకే కిరీటిని విడిగా పిలిచి, 'చూడు బాబూ! శిల్ప అతిగారాభంగా పెరిగిన ఆడపిల్ల.... అహంకార పూరితమైన ఆలోచనలు తప్ప అనురాగానికి అర్థం తెలీని అమాయకురాలు. ఒక విధంగా ఇది నా పెంపకంలో జరిగిన పొరపాటేనని ఒప్పుకోటానికి సిగ్గుపడను. తెలిసో తెలియకో అది చేసే ఆకతాయి పనుల్ని, దురుసు ప్రవర్తనను అర్థం చేసుకొని కాపాడుకుంటావన్న నమ్మకంతో నీవెంట పంపుతున్నాను.' అంటూ చేతులు పట్టుకుని ప్రాధేయ పడ్డారు.

మరోగంటలో కారు వాల్తేర్ అప్ లేండ్స్‌ని చేరుకుంది.

మాలినీ నిలయంలో కారు ఆగగానే నౌకర్లంతా బారులు తీర్చి నిలబడ్డారు.

భూషణ్ మొదలుకొని వంటమనిషి వరకు శిల్పకు అందర్నీ పరిచయం చేశాడు కిరీటి.

డ్రాయింగ్‌హాలు లగాయతూ వంటగదివరకూ విడివిడిగా చూపించి ఆమెతో సహా తన బెడ్ రూమ్‌లోకి అడుగు పెట్టాడు.

అల్ట్రా మోడర్న్ డిజైన్‌తో అందమైన పూలచెట్లు మరింత సుందరమైన పరిసరాలతో సమీపంలో సముద్రపు హోరుతో ఆ భవంతి ఆమెకెంతో నచ్చింది.

అయినా పెదవి కదిపి ఒక్కమాటా మాట్లాడలేదామె.

మరో పదిహేను నిమిషాలలో తయారై వచ్చిన కిరీటి 'ఇదిగాక నాకు అఫీషియల్ కాలనీలో మరో బంగళా, శాంతి ఆశ్రమానికి చేరువుగా ఓ గెస్ట్ హవుస్ ఉన్నాయి. ఇక్కడ విసుగనిపించినపుడు అక్కడకు వెళ్ళి రావచ్చు. డాట్సన్‌ను డ్రైవర్‌తో సహా నీకోసం ఏర్పాటు చేశాను' అంటూ హడావిడిగా చెప్పి బయటకు వెళ్ళబోతూ ఒక్క క్షణం ఆగాడు.

'మరో విషయం..... బిజినెస్ వ్యవహారాలలో పడి ఒక్కోసారి భోజనం కూడా మర్చి పోతుంటాను. నాకోసం ఎదురు చూడాల్చిన అగత్యం లేదు. నో ఫార్మాలిటీస్. అన్నట్టు షాపింగ్‌కి డబ్బేమన్నా కావలసి వస్తే లాకర్‌లో వుంది.'

తాళాలు అందించ బోతుంటే విసురుగా చేతిని వెనక్కి లాక్కుంది.

'ఈ బంగారు పంజరంలో మీరు నాకోసం మీరు చేసిన ఏర్పాట్లకు సంబరంగా వుంది. మీరిచ్చిన డబ్బుకి బదులుగా బానిసనై మీ వెంట వచ్చిన నేను మీ డబ్బుని మరింత వాడుకొని ఋణగ్రస్తురాల్ని కాలేను. ఐ మీన్ ఆ డబ్బుకి బదులుగా మీరు నాదగ్గర మరేమన్నా కోరితే ఇవ్వడానికికేం లేదు.'

ఛెళ్ మనిపించిందామె జవాబు.

అన్యమనస్కంగానే ఫ్యాక్టరీకి బయలు దేరిన కిరీటి ఆఫీసులో అందరి నమస్కారాలను అందుకుంటూ ఎమ్‌డీ చాంబర్‌ను చేరుకున్నారు.

భూషణ్ అందించిన పెండింగ్ పేపర్సును సైన్ చేసి ఎక్స్‌పోర్ట్ మెటీరియల్‌కి సంబంధించిన ఫైలును తిరగేస్తూ చాలాసేపు కూర్చున్నాడు.

దేని పైనా మనసు లగ్నం కావటంలేదు.

ఫోన్ మ్రోగటంతో విసుగ్గా రిసీవర్‌ని అందుకున్నాడు.

సేట్ ప్రమోద్ లాల్..... ఎలక్ట్రోడ్ కంపెనీ యజమాని.......

'వ్యాట్ మిష్టర్ కిరీటి... ఇట్స్ టూ బాడ్...'

'యు మీన్...'

'ది మారేజ్ విచ్ యూ హావ్ డన్ విత్తౌట్ ఇన్‌ఫార్మింగ్ ఎనిబడీ.....' నొచ్చుకున్నట్టుగా అన్నాడు.

'ఏదో అలా అర్జంటుగా జరిగిపోయింది.'

'నో నో నో..... నువ్వు చేసిన పొరపాటుకి చాలా హెచ్చు పెనాల్టి చెల్లించుకోవాల్సి వుంటుంది.'

'విత్ ప్లెజర్.....'

'ఏమైనా లవ్ మేరేజ్...'

'ఉహూ...'

'ఇట్సాల్‌రైట్ ..... మన వాళ్ళందరికి గ్రాండ్ పార్టీ అరేంజ్ చేయాలి.'

'అలాగే...'

ఫోన్ పెట్టేసిన మరుక్షణం మరో ఫోన్.